## మద్యం దుకాణాలకు ఆరు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మద్యం దుకాణాలకు గురువారం ఆరు దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 158 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈనెల ఒకటో తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈనెల రెండో తేదీన ఒక దరఖాస్తు నమోదైంది. దీంతో ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖకు మొత్తం ఏడు దరఖాస్తులు చేరాయి. వాటిలో శ్రీకాకుళం మున్సిపాలిటీ నుంచి మూడు రాగా పొందూరు, కోటబొమ్మాళి నుంచి రెండేసి చొప్పున వచ్చాయి.

# అడ్డగోలుగా తవ్వకాలు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఉమ్మడి జిల్లా భామిని మండలంలో ఇసుక మూలాలు
- కూటమిలో గ్రూపులతో బయటపడుతున్న వైనం
- జిల్లాకు చెందిన ఇద్దరు కీలక నాయకులకు ముడుపులు

**జిల్లాలో అడ్డూ అదుపూ లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. నిత్యం వందల కొద్దీ లారీలతో పెద్దఎత్తున విశాఖకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా మూలాలు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎవరి వాటాలు వారికి వెళ్లడంతో అంతా గప్‌చుప్ అయిపోతున్నారు. జిల్లాలోని పలు మండలాలోని పోలీస్‌స్టేషన్ల పక్క నుంచే వెళ్తున్నా పోలీసులు కళ్లు మూసుకుంటున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు కనీసం దృష్టిసారించకపోవడంతో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.**

కొత్తూరు మండలం మెట్టూరు వద్ద పట్టుబడిన ఇసుక లారీలు



ఇసుక రవాణాకు సంబంధించిన తప్పుడు బిల్లులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలంలోని పలు రీచ్‌ల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. తవ్విన ఇసుకను జిల్లాలోని కొత్తూరులోకి ప్రవేశించి అక్కడ నుంచి హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస మీదుగా శ్రీకాకుళం కొత్తరోడ్డుకు చేరుకుని అక్కడ నుంచి విశాఖకు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. భామిని మండలంలోని తాలాడ, దిమ్మిడిజోల, పసుకుడి, బిల్లుమడ, కాట్రగడ తదితర ప్రాంతాల్లో అనధికారికంగా పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాలాడలో చాలా ఉధృతంగా సాగుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఈ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున విశాఖకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. లారీ పరిమాణం బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. 12 చక్రాల లారీకి రూ.25 వేలు, 14 చక్రాల లారీకి రూ.30 వేలు, 16 చక్రాల లారీకి రూ.35 వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ రవాణా అంతా టిడిపి, జనసేన నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నట్లు తెలిసింది.

### తప్పుడు బిల్లులతో అక్రమ రవాణా

జిల్లా మీదుగా చాలా ఏళ్లుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గతంలో వైసిపి నాయకులు భాగస్వామ్యులు కాగా ఇప్పుడు టిడిపి, జనసేన నాయకులు ఆ పని చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచరులు గత నెల 30న కొత్తూరు మండలం మెట్టూరు వద్ద లారీలను అడ్డుకోవడంతో మొత్తం బండారం బయటపడింది. అవి ఒడిశాలోని రాయగడ జిల్లా పెంగోడ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వాస్తవానికి అవన్నీ భామిని మండలంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి వచ్చినట్లు తెలిసింది. ఒడిశా రీచ్‌ల నుంచి ఇసుకను కొనుగోలు చేసినట్లు తప్పుడు బిల్లులు పెట్టి ఇసుక అక్రమ రవాణా చేస్తునట్లు స్థానికులు చెప్తున్నారు.

### ఇలా బయట పడింది

జిల్లా మీదుగా నిత్యం ఇసుక అక్రమంగా తరలిపోతున్నా ఏవీ బయట పడలేదు. ఇప్పుడు ఇసుక లారీల పట్టివేత వెనుక టిడిపి నాయకుల మధ్య నెలకొన్న గ్రూపుల పోరే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కొత్తూరు మండలం ఆకులతంపర నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఇసుక లారీలు విశాఖకు వెళ్తూ ఉండేవి. దీని వెనుక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఉన్నారన్న సమాచారంతో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ స్థానికులతో కలిసి అడ్డగించి పోలీసులకు అప్పగించారన్న ప్రచారం నియోజకవర్గంలో సాగుతోంది. అందుకు ప్రతీకారంగా ప్రస్తుత ఇసుక అక్రమ రవాణాలో కలమట వెంకటరమణ తనయుడు సాగర్‌కు వాటాలున్నాయన్న సమాచారంతో ఎమ్మెల్యే గోవిందరావు అనుచరులు ఈనెల 30న లారీలను అడ్డగించి పోలీసులకు అప్పగించారన్న చర్చ సాగుతోంది.

### కేసు నమోదు చేయకుండా ఒత్తిళ్లు?

ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన లారీలు, యజమానులపై కేసు నమోదు చేయొద్దంటూ అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్య నాయకులు పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు కొత్తూరు మండలంలో జోరుగా చర్చ సాగుతోంది. దీంతో పోలీసులు కేసు నమోదుపై మీడియాకు స్పష్టంగా చెప్పడం లేదు. ఇసుక లారీలను కొత్తూరులోని ఓ ఖాళీ స్థలంలో మూడు రోజులుగా అలాగే ఉన్నాయి. ఇసుక అక్రమం కాకపోతే పోలీసులు ఆపే పరిస్థితి ఉండదు. ఇసుక లారీలను పట్టుకున్న తర్వాత తప్పుడు బిల్లులు, అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించిన తర్వాతే దాన్ని ఆపారు. కేసు నమోదులో ఎందుకు జాప్యం చేస్తున్నారన్న సందేహాలు అందరిలోనూ తలెత్తుతున్నాయి. కొద్దిరోజులు అలా ఉంచి పంపేస్తారా, కేసు నమోదు చేస్తారా అన్నది చూడాల్సి ఉంది.

### కీలక నాయకులకు ముడుపులు

ఉమ్మడి జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు టిడిపికి చెందిన ఇద్దరు కీలక నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది. వీరికి ముడుపులు అందుతున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వీరితోపాటు పాలకొండ నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధికి, భామిని మండలంలోని టిడిపి, జనసేన చోటామోటా నాయకులకూ వారికి నిర్ణయించిన రేటు ప్రకారం డబ్బులు చేరుతున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు పోలీసులకూ పెద్దఎత్తున డబ్బులు అందుతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఎక్కడ జరుగుతుందో భామిని, కొత్తూరు మండలాల్లోని ఓ గ్రామస్థాయి నాయకునికి సైతం తెలిసినా పోలీసులకు తెలియకపోవడం గమనార్హం. కొత్తూరు నుంచి ఆమదాలవలస వరకు ఉన్న బత్తిలి-అలికాం రోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ల పక్క నుంచే వెళ్తున్నా వారు పట్టుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. కొత్తూరు మండలం మెట్టూరు వద్ద పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలను పరిశీలిస్తాం. ఇసుక ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకుని కట్టడి చేస్తాం. అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన సంబంధిత వ్యక్తులకు అపరాధ రుసుము విధిస్తాం.

**- సి.మోహనరావు, జిల్లా గనులశాఖ అధికారి**

దీక్షలో పాల్గొన్న రైతు, ప్రజాసంఘాల నాయకులు

## కేంద్రం కుట్రలను ప్రతిఘటించాలి

- పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల
- రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పన్నుతున్న కుట్రలను అంతా ప్రతిఘటించాలని అఖిలపక్ష రైతు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పోరాటాల ద్వారానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలమని, ఈ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేసి పరిరక్షించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజు దీక్షలను రైతుసంఘం నాయకులు బి.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకంగా మారిన ఉక్కును మోడీ సర్కార్ ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా అన్యాయంగా వ్యవహరిస్తోందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో బిజెపి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా రాష్ట్రంలోని టిడిపి, జనసేన నోరెత్తడం లేదని విమర్శించారు. విద్యార్థులకు ఉద్యోగాలు, సామాజిక న్యాయం దక్కాలంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే ఉంచాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు పోరాటాలు చేయాలని కోరారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి తిరుపతి లడ్డూపై పాలకులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దీక్షలకు మద్దతుగా వైసిపి రైతు విభాగం జోనల్ అధ్యక్షులు గొండు రఘురాం, కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ సంఘీభావం తెలిపారు. దీక్షల్లో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, వైసిపి కార్మిక విభాగం నాయకులు ఎస్.వెంకట్రావు, వైసిపి నాయకులు ఆర్.శంకరరావు, ప్రజానాట్యమండలి నాయకులు ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్.రామచంద్రరావు, రైతు సంఘం నాయకులు టి.నందోడు, యు.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ 6 హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?

### కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల హామీనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అధికారం చేపట్టి వంద రోజులైనా వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఒక హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్తామన్న హామీలు అమలు చేయకపోవడంతో పేదల్లో ప్రభుత్వంపై అసహనం పెరిగిందన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, అందుకే మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటోందన్నారు. ప్రజల కష్టాలు తీరుస్తామని అధికారంలోకొచ్చిన చంద్రబాబు, వాటి పరిష్కారానికి చొరవ చూపకుండా తిరుపతి లడ్డూ చుట్టూ తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. లడ్డూ కోసం వాడిన నెయ్యిలో కల్తీ వాస్తవమే అని, అందులో జంతు కొవ్వు కాకుండా పామాయిల్ వాడారని చెప్పారు. తిరుపతి లడ్డూ కోట్లాది మంది మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశమని, దానిపై రాజకీయాలు చేయడం తగదన్నారు. అమరావతిలో ఇప్పటికే రూ.వేల కోట్లు ఖర్చు చేశారని, ఇంకెంత ఖర్చు చేస్తారో తెలియదన్నారు. ప్రజల అవసరాలు ఎన్నో ఉన్నాయని, వాటిని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లకు వరంగా మారిందన్నారు. ఈ ప్రాజెక్టును ఎప్పటికి పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న చింతా మోహన్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## స్వర్ణాంధ్ర సాధనలో అందరి భాగస్వామ్యం

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వర్ణాంధ్ర-2047 సాధనకు అందరి భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా ఆర్థిక, సామాజిక, సాంకేతికంగా వృద్ధి చెందేందుకు తగిన సూచనలు సేకరించేందుకు వర్క్‌షాపు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి గురువారం అభిప్రాయ సేకరణకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి సంపన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్నారు. ఇందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. జిల్లాలో సుదీర్ఘ తీరం ఉందని, దీన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరముందన్నారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపిస్తే, అందులో పనిచేయడానికి టెక్నికల్ స్టాఫ్ అవసరం ఉంటుందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పాలిటెక్నికల్, ఐటిఐ చేసిన వారికి జిల్లాలోనే ఉపాధి కల్పిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా ఆ పరిశ్రమకు లాభం కూడా ఉంటుందని వివరించారు. పరిశ్రమలతోనే కాకుండా ఆ ప్రాంతానికి వచ్చే సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. ప్రాథమిక రంగం నుంచి వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగుపై పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ సాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం కూలీల కొరత వేధిస్తున్న నేపథ్యంలో యాంత్రీకరణ ఎంతో మేలు, ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. జీడి, కొబ్బరి పంటలపై పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం పాత పద్ధతిలోనే సాగు చేస్తున్నారని, అధునాతన పద్ధతులు అవలంభించడం లేదన్నారు. పలాసకు చెందిన రైతు మాట్లాడుతూ ఇటీవల తాను నూతన పద్ధతులను తెలిపే ఒక బృందాన్ని బెంగుళూరు నుంచి తీసుకొచ్చానని, వారు తెలిపిన పద్ధతుల్లో పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎకరాకు మూడు క్వింటాళ్లు పండితే ప్రస్తుతం తాను కొత్తగా వేసిన మొక్కలు మూడేళ్లలోనే ఎకరాకు పది క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ విధంగా జిల్లావ్యాప్తంగా అనుసరిస్తే ఆ ప్రాంత రైతులు బాగుపడతారన్నారు. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి సాధించేందుకు అందరు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. పలువురు ఎన్‌జిఒ సంస్థలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పరిశ్రమల యాజమాన్యాలు వారి అభిప్రాయాలను తెలిపారు. సమావేశంలో జిల్లా సిపిఒ లక్ష్మీప్రసన్న, పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్, స్వచ్ఛంద సంస్థలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

### ఎపిఎస్ఐఆర్‌డి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆయా అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. గ్రామ, మండల, జిల్లాపరిషత్‌లో సాధారణ కనీస పరిపాలనా విధాన చట్టం 1994, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ ప్లాన్లు, బిల్డింగ్ రెగ్యులరైజేషన్, స్థానిక సంస్థల ఆస్తులు పరిరక్షణ, వీధిదీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అక్షరాస్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య శాసనాలు, సాంఘిక సంక్షేమ పథకాలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఎంపిక చేసిన పంచాయతీరాజ్‌లోని పలు కేడర్‌లకు చెందిన 11 మందికి ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వీరంతా ఆయా గ్రామ పంచాయతీల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆయా అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్

## 'సహారా' డిపాజిట్లు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సహారా ఖాతాదారులకు డిపాజిట్ సొమ్మును తక్షణమే చెల్లించాలని సహారా కస్టమర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బోయిన సత్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో సహారా ఏజెంట్లు, ఖాతాదారుల సంక్షేమ సంఘం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహారా చెల్లింపులు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో 12 ఏళ్లలో 7,674 మంది ఏజెంట్లు, ఖాతాదారులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 ఏళ్లుగా ఖాతాదారులకు గడువు ముగిసినా డిపాజిట్లకు చెల్లింపులు చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా సుమారు ఐదు వేల బ్రాంచ్‌లకు గానూ వెయ్యి బ్రాంచ్‌లను కొనసాగిస్తూ మిగిలిన నాలుగు వేల బ్రాంచ్‌లను మూసివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ హైకోర్టు సహారా యాజమాన్యం ఎటువంటి వ్యాపారం చేయకూడదని 2022 మార్చిలో షరతు విధించినా, ఆ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ పద్ధతిలో వ్యాపారం చేస్తోందని విమర్శించారు. గతంలో ఐదుసార్లు ప్రజలకు ఇవ్వాల్సిన బకాయి కంటే మూడు రెట్లు ఆస్తులు ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించినా, నేటికీ ఖాతాదారులకు చెల్లించడం లేదన్నారు. దీనివల్ల వేలాది ఏజెంట్లు, డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు బైపల్లి సత్యరాజు, కార్యదర్శి కె.వి ప్రసాదరావు, జామి కొండలరావు, సహారా ఏజెంట్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బోయిన సత్యనారాయణ

## బస్ పాస్‌ల జారీకి కొత్త వెబ్‌సైట్

**శ్రీకాకుళం అర్బన్ :** ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆర్‌టిసి జారీ చేస్తున్న ఉచిత, రాయితీ బస్సు పాసుల కోసం కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా మంత్లీ సీజన్ టిక్కెట్ (ఎంఎస్‌టి)పై తిరిగే ప్రయాణికులకు పాస్‌ల జారీ మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్ పనితీరు, నాణ్యతను మెరుగుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ వెబ్‌సైట్ ఈనెల 5, 6 తేదీలు మినహా మిగిలిన రోజుల్లో యధావిధిగా బస్ పాసుల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొత్త పాసుల మంజూరు కోసం విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికేట్, బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు నకలు తీసుకుని ఆన్‌లైన్‌లో apsrtcpass.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని పలాస, టెక్కలి, శ్రీకాకుళం బస్‌స్టేషన్లలోని బస్ పాస్ కౌంటర్ వద్దకు వచ్చి పాస్‌లను పొందవచ్చని తెలిపారు.

## తమ్మినేని అక్రమాలతోనే మున్సిపాల్టీకి కష్టాలు

### ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆయన తనయుడు అక్రమాలతో మున్సిపాల్టీ ప్రజలు కష్టాల బారిన పడ్డారని ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆరోపించారు. సరుబుజ్జిలి మండలం పరిధిలోని అలమాజీపేట వద్ద నుంచి మున్సిపాల్టీకి తాగునీరు అందిస్తున్న వంశధార నదీ పరివాహక ప్రాంతంలోని పంపుహౌస్‌లను మున్సిపల్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకులు, మోటార్లు, పైపులైన్లను పరిశీలించి మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎఇ అప్పలనాయుడుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో అందిస్తున్న తాగునీటి పైపుల్లో భారీస్థాయిలో బురద నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో అలమాజీపేట పంపు హౌస్‌ను పరిశీలించినట్లు తెలిపారు. మున్సిపాల్టీలోని పలు వార్డులకు తాగునీరు అందించడానికి ఐదు మోటర్లు అవసరం కాగా, టిడిపి ప్రభుత్వ హయాంలో మూడు మోటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇటీవల మోటార్లు మరమ్మతులకు గురై మూలకు చేరగా, వాటిని తిరిగి మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి మున్సిపాల్టీలో డబ్బులు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. వైసిపి పాలనలో తమ్మినేని అక్రమ కలెక్షన్లతో మున్సిపాలిటీలో పెద్దఎత్తున జరిగిన అక్రమ నిర్మాణాలతో ఆదాయం లేని మున్సిపాలిటీగా మారడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. త్వరలోనే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి మున్సిపాలిటీలో తాగునీటి ఇబ్బందులకు చరమగీతం పాడతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి శేషు మోహన్, అప్పలనాయుడు, కె.వి సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ దుకాణాలను పరిశీలిస్తున్న రవికుమార్

## కాలువపై ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పారిశుధ్య నిర్వహణ పనుల్లో భాగంగా కాలువలపై ఉన్న ఆక్రమణ షాపులను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం పురపాలక సంఘంలోని 15వ వార్డు పరిధిలోని గణేష్ నగర్, మోణింగి వారి వీధిలో ఆయన పర్యటించి పలు ప్రాంతాలను పరిశీలించారు. గణేష్ నగర్‌లోని మురికి కాలువలను పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాత స్టేట్ బ్యాంక్ ప్రాంతంలో మురికి కాలువలపై ఏర్పాటు చేసిన షాపులను ఆయన గుర్తించి మున్సిపల్ అధికారులను వివరాలు అడగ్గా డ్రైనేజీలపై ఇటువంటి షాపులు ఏర్పాటు చేయడం వలన పారిశుధ్య పనులు నిర్వహణకు అంతరాయం ఏర్పడి పట్టణ ప్రాంతం దుర్వాసనగా మారుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డ్రైనేజీపై ఉన్న షాపులను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముందుగా మండలంలోని శ్రీరామవలస పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే కంప్రెసెడ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీతా సాగర్, టిడిపి నాయకులు కూన ఆంజనేయులు, సంపదరావు మురళీధర్‌రావు, నాగళ్ల మురళీధర్, గురయ్య పాల్గొన్నారు.

బాబూరావును సన్మానిస్తున్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

## బాబూరావుకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో బాబూరావు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి చేపట్టడంతో రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు బాబూరావుకు సన్మానం చేశారు. వారితో పాటు ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు.

పాతపట్నం : గౌతమిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- పాతపట్నం

2021-23లో పాతపట్నం ఆదర్శ పాఠశాలలో బైపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న బండి గౌతమి నీట్ ఎంట్రెన్స్ 2024లో 720కు 700 మార్కులు తెచ్చుకొని ఆల్ ఇండియాస్థాయిలో 1125, రీజనల్ స్థాయిలో 353 ర్యాంక్ సాధించి ఋషికేష్ ఎయిమ్స్‌లో మెడిసిన్ సీట్ సాధించడంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, గౌతమిని, గౌతమి తల్లి బండి భారతిని గురువారం స్థానిక కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వి. రత్నకుమారి మాట్లాడుతూ గౌతమి సాధించిన ఈ ఘనత పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర ఉపాధ్యాయులు అప్పలరాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది ఉన్నారు.

**వజ్రపుకొత్తూరు:** ఉద్దానం ప్రాంతంలో మారుమూల గ్రామమైన తామాడపేటకు చెందిన తామాడ శ్రుతి నీట్‌లో 720 మార్కులకు 615 మార్కులు సాధించింది. ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆమెకు శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. దీంతో తామాడపేటలో విద్యార్థినికి గురువారం అభినందనలు వెల్లువెత్తాయి. గ్రామ చరిత్రలో శ్రుతి డాక్టర్‌గా ఎదగడంతో తల్లిదండ్రులు తామాడ కృష్ణారావు, చన్నమ్మ, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ డి. నారాయణస్వామి, పోతనపల్లి దశరథరావు తదితరలు అభినందనలు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

## పోస్టర్ ఆవిష్కరణ

**టెక్కలి రూరల్:** టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఎనెఎస్ఐటి రౌర్కెలా సంయుక్తంగా 2024 డిసెంబరు 4, 5 తేదీల్లో ' ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంటిలిజెంట్ మేనిఫేక్చరింగ్ సిస్టమ్స్ ( ఐసిఐపిడిఐఎంఎస్-2024 ) అనే అంశంపై ఐతమ్ నిర్వహించబోయే అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన చేస్తున్న విద్యార్థులకు, భోదన సిబ్బందిలో మరిన్ని నైపుణ్యతలు మెరుగు పడడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్ సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ వై.రమేష్, డీన్లు సిహెచ్ రమేష్, యు.డి. ప్రసన్న, డాక్టర్ శ్రీరాములు, కో-ఆర్డినేటర్ డాక్టర్ మాదిన జయంతిరావు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

**ఇచ్ఛాపురం:** రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరుకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గత నెల ఆర్ట్స్ కళాశాల శ్రీకాకుళం వేదికగా జరిగిన కోన చెన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి నలుగురు విద్యార్థులు ఎంపికైయ్యారు. వీరిలో అండర్ -14, జూనియర్ ట్రయతలోన్ గ్రూప్ బి.విభాగం నుంచి బి. భరత్ చంద్ర, ట్రయతలోన్ గ్రూప్ ఎ నుంచి టి. వినీత, అలాగే అండర్-16 హై జంప్ బాలికల విభాగంలో టి. అన్విత, అండర్ -18 హై జంప్ బాలికల విభాగంలో డి.అమృత ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికైయ్యారు. వీరు ఈ నెల 4 నుంచి 6 వరకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగినున్న పోటీల్లో పాల్గొంటారు. వీరికి పాఠశాల హెచ్ఎం జె.సరోజిని, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జానకిరామ్, ఉపాధ్యాయులు వెంకటరమణ, గోవిందరావు, శంకర్ రెడ్డి, గ్రామపెద్దలు అభినందించారు.

సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

# సేంద్రీయ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి- బూర్జ

రైతులు సేంద్రీయ విధానంలో సాగుచేస్తే అధిక లాభాలను పొందవచ్చునని కొత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రాజగోపాల్ సూచించారు. గురువారం మండలం కొరగాం, ఉప్పినవలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరి పంటలో ఎరువుల యాజమాన్యం, చీడ పీడలు గుర్తించే పద్ధతి, నివారణ చర్యలను రైతులకు వివరించారు. సుడిదోమ వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ప్రతి రోజూ పొలం పరిశీలన చేయాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు, కొరగాం సర్పంచ్ దన్నాన శ్రీరామ్‌మూర్తి, వెంకటప్పల నాయుడు, ఎంపిటిసి కృష్ణంనాయుడు, వాసుదేవ నాయుడు, వ్యవసాయ సహాయకులు అశోక్, దిలీప్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

**కవిటి:** రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని ఎఒ బడగల దుర్గా ప్రసాద్ సూచించారు. మండలం వరక, కుసుంపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిఇఒ లలిత కుమారి, ఆర్‌ఎస్‌కె ఇన్‌ఛార్జిలు అన్వేష్, జగదీష్, వైసిపి నాయకులు శివ బిసాయి, శ్రీకాంత్ పురియా, సత్యనారాయణ పాల్గొన్నారు.

బూర్జ : పొలాలను పరిశీలిస్తున్న రాజ్‌గోపాల్

**టెక్కలి రూరల్:** సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఎఒ గురువెల్లి రంగారావు అన్నారు. మండలంలో మేఘవరం రైతు సేవా కేంద్రం పరిదిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కెల్లి శ్రీరాములు, మాధవరావు, అధికారులు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** మండలంలో నీలంపేట సచివాలయం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

**నందిగాం:** రైతులు చీడపీడల నివారణకు పురుగుమందులు పిచికారి చేసినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు మధుకుమార్, శ్రీనివాసరావు అన్నారు. వళ్లభరాయుడు పేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీకాంత్ వర్మ, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

## ఎంపిడిఒలుగా బాధ్యతల స్వీకరణ

నీరజ సూర్యనారాయణ మన్మథరావు పావని

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ఎంపిడిఒగా వి.నీరజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కంచిలి మండలంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ ఎం.పావని సరుబుజ్జిలి బదిలీపై వెళ్లారు.

**మందస:** స్థానిక ఎంపిడిఒగా పైల సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంచిలి మండలంలో విధులు నిర్వహించి మందస బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ తిరుమలరావు కంచిలి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈయనను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

**పొందూరు:** స్థానిక ఎంపిడిఒగా మీసాల మన్మధరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి జిల్లా మునగపాక మండలం ఎంపిడిఒగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియ జేశారు.

**సరుబుజ్జిలి :** స్థానిక ఎంపిడిఒగా ఎం.పావని బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహించిన పి.వి.మురళీమోహన్ కుమార్ సారువకోట ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు. కొత్తూరు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న పావని బదిలీపై సరుబుజ్జిలి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ పావనికి మండల పరిషత్ సిబ్బంది, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

కవిటి : మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

## సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

**ఆమదాలవలస:** సమన్వయంతోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోట పంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 243(ఎ) ప్రకారం రాష్ట్ర శాసనసభల ద్వారా కొన్ని చట్టబద్ధమైన అధికారాలు, విధులను గ్రామసభకు కల్పించారని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు మాట్లాడుతూ రైతులందరికీ పొలం పిలుస్తుంది కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సంధ్యారాణి గ్రామంలో గుర్తించిన పనులను వివరించారు. సర్పంచ్ ప్రతినిధి అప్పల నాయుడు మాట్లాడుతూ అన్ని శాఖల సహకారం, సమన్వయంతో గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాగర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రజిత, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ లత, విఒఎ వనజాక్షి, గ్రామ సంఘం అధ్యక్షులు అన్నెపు సరోజిని, మహిళా స్వయంశక్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బూర్జ:** మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించడం జరుగుతుందని ఎపిఒ రాజ్ కుమార్ తెలిపారు. మండలంలోని పాలవలస, సింగన్నపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

**కవిటి:** పార్టీలకు అతీతంగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో చేపట్టిన, చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాలం రమేష్, ఆరింగి మధుబాబు, బెందాలం తిరుమలరావు, ప్రగడ మణిబాబు, బెందాలం సురేష్, ఒఇ జి.వీరభద్ర స్వామి, ఎపిఒ మోహనరావు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, పంచాయతీ, సచివాలయం, అంగన్వాడీ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో తమ్మినేని వేణు, సచివాలయ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

## ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ శుక్రవారం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద జరగనున్న మహధర్నా కార్యక్రమం జయప్రతం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ నాయకులు ఎస్.గౌరమ్మ, కె.జ్యోత్స్న, ఎస్.పూర్ణిమ పిలుపునిచ్చారు. మండలంలోని కురిగాం, మెట్టూరు పిహెచ్‌సిల వైద్యాధికారులు పి.ప్రసన్న కుమార్, తేజేశ్వరిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రూప్ ఇన్సరెన్స్ రూ.10.లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పద్మ, శ్రీలత, నిర్మల, లక్ష్మీ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో ప్రజలకు ఎదురవుతున్న పలు సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుగా శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజాదర్బారు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుంది. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన సమస్యలపై ఈ దర్భారులో ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఇందు కోసం డివిజన్ల వారీగా షెడ్యూల్ రూపొందించినట్టు ఆయన తెలిపారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను తన దృష్టికి తీసుకు రావచ్చని ఆయన వివరించారు. స్వీకరించిన వినతుల ఆధారంగా వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉద్యోగులు సైతం హాజరు కానున్నారని తెలిపారు. ఈసౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## శ్రీనివాసుని సేవలో శిరీష

**పలాస:** సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఎమ్మెల్యే గౌతు శిరీష తిరుమల వెంకటేశ్వరస్వామని దర్శించుకున్నారు. కూటమి అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేసిన మందస మండల నాయకులతో కలిసి శిరీష, టిడిపి పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మందస మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు దుర్యోధన, రుద్రయ్య, లింగరాజు, తాతారావు, నవీన, లచయ్య, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షునిగా కుమార్ రాజా

**శ్రీకాకుళం అర్బన్:** శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ ఆదేశానుసారం జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి సూచనలు మేరకు ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) ఆధ్వర్యాన జిల్లా శ్రీశ్రీ కళావేదిక నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. కళా వేదిక గౌరవ అధ్యక్షులుగా సురంగి. మోహన రావు, అధ్యక్షులుగా బుర్రి కుమార్ రాజా, ఉపాధ్యక్షులుగా కె.ఎ.రాములు, ప్రధాన కార్యదర్శిగా వావిలపల్లి రాజారావు, కార్యదర్శులుగా మోహన గాంధీ, కిరణ్, సాంస్కృతిక కార్యదర్శులుగా కె.వి.రాజారావు, వాడాడ శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శిగా చోడవరపు లక్ష్మి, కోశాధికారిగా కె. శ్రీను, ప్రచారకార్యదర్శిగా తాల్లూరి విజయ్ లక్ష్మణ్, గౌరవ సలహాదారుగా జంధ్యాల శరత్‌బాబు ఎన్నికయ్యారు.

## ముగిసిన కొత్తమ్మతల్లి ఉత్సవాలు

**కోటబొమ్మాళి:** స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు జరిగిన ఈ ఉత్సవాలు చివరి రోజు గురువారం అత్యంత వైభవంగా ముగిశాయి. వేకువజాము నుంచే భక్తులు వేలాది సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్లు దారి పొడవున అడుగు వేయడానికి వీలు లేని విధంగా భక్తుల రద్దీ ఉండడంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. పోలీస్‌శాఖ ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి పలుచోట్ల వాహనాలను పార్కింగ్ చేయించారు. స్థానిక రెడ్డిక వీధిలో గల కమ్మకట్టు చిన్నఅప్పలస్వామి ఇంటి నుంచి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య తీసుకురాగా మహిళలు పసుపు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి దండకం చదివి తల్లిని చల్లదనం చేశారు. అలాగే ముగింపు సందర్భంగా యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. సుమారు 40 వేల మంది భక్తులకు అన్నదాన సంతర్పణ చేశారు.

### పోలీసుల సేవలు భేష్

అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో ఉన్న యాత్రికులు

జాతర సందర్భంగా పోలీసులు అందించిన సేవలపై భక్తులు పోలీస్ శాఖకు మంచి కితాబిచ్చారు. టెక్కలి సిఐ కె.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఎస్ఐ సత్యన్నారాయణ పర్యవేక్షణలో సుమారు 450 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి గ్రామమంతా సిసి కెమెరాలు, డ్రోన్‌లు ఏర్పాటు చేసి సిఐ ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకోని సిబ్బందిని అప్రమత్తం చేసారు. దీంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

మండలం బైరిపురం 11 కెవి ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 11కెవి బైరిపురం ఫీడర్‌లోని బైరిపురం, డిజి పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీల పరిధిలో గల గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**పాతపట్నం:** విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పాతపట్నం, బూరగాం, కొరసవాడ, కాగువాడ, బొరుభద్ర, గురండి, బగదల, సీతారాంపురం, చంగుడి, గోపాలపురం, సరాలి, తిడ్డిమి, రంకిని, దాసుపురం, సూర్యనారాయణపురం తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతులు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామనిటెక్కలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

**మెళియాపుట్టి:** విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కె ఫీడర్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ జి.శంకరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెద్దపద్మాపురం, మర్రిపాడు(సి), కొసమాల, వసుంధర, చాపర, మెళియాపుట్టి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**టెక్కలి రూరల్ :** టెక్కలి టౌన్ 11 కెవి ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు ఇఇ జి.శంకరరావు తెలిపారు. తెంబూరు రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, గ్యాస్ గొడాం, ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

## పంటకోత ప్రయోగాలపై శిక్షణ

**కవిటి:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై విఆర్ఒలు, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలకు గురువారం శిక్షణ కల్పించారు. ఈ శిక్షణలో తహశీల్దార్ బి.మురళీ మోహన్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలు యూనిట్‌గా విభజించి పంటకోత ప్రయోగాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అదే విధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిటి రామచంద్రరావు, ఎఒ బి.దుర్గా ప్రసాద్, ఎఎస్ఒ బి.మనోహరరావు, విఆర్ఒలు, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన స్వర్ణాంధ్ర 2047 వ్యాసరచన పోటీల్లో మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలవరం విద్యార్థిని ప్రథమ స్థానం, అలాగే డిబేట్ కాంపిటేషన్‌లో తృతీయ స్థానంలో నిలిచారని హెచ్ఎం, డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ తెలిపారు. వ్యాసరచన పోటీలో పదవ తరగతి చదువుతున్న కె.జాహ్నవి ప్రథమ స్థానం, డిబేట్‌లో పి.దేవి, బి.లావణ్య తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. గైడ్ టీచర్‌గా సోషల్ అసిస్టెంట్ పి.సిమ్మన్న వ్యవహరించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్స్ కార్యవర్గం ఎన్నిక

**శ్రీకాకుళం అర్బన్:** జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ నూతన అధ్యక్ష, కార్య దర్శులుగా జె.కేశవరావు, బి.అప్పలరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని జిల్లాలోని ఆయా పిహెచ్‌సిలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు ఎన్నుకున్నారు. ట్రెజరీగా సిహెచ్. విజయ్ కుమార్, పెసిడెంట్‌గా ఎన్.లూసీ ఎస్తర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జి.రాజేష్, ఉపాధ్యక్షులను, సహాయ కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి రాజేష్, వి.మాధవి రాణి, బి. అరుణ కుమారి, కె.జగదీష్, వెంకటరమణ, సిహెచ్. విజయ్ ఎన్నికయ్యారు.

## కాశీనగర్‌లో ఐక్యతా సమావేశం

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా కాశీనగర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం, అఖిల భారత కిసాన్ మజ్ దూర్ సంఘ్ (ఎఐకెఎంఎస్) ఐక్యతా సమావేశం నిర్వహించారు. రైతు కూలీ, రైతు సంఘం అధ్యక్షులు జూన్ గోమాంగో, ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కేథర్ సబర్, కడగల గోపాలరావు, యర్నాగుల లక్ష్మినారాయణ, సాసూపిల్లి మధు, మోహనరావు, కృష్ణారావు, సంబ్రూ సబర్ లక్షింపూర్ ఖేర్ సంఘటనలో అమరులైన రైతులకు నివాళ్లర్పించారు. స్వామినాథన్ కమిషన్‌ను అమలు చేయాలని వారు పిలుపునిచ్చారు.

## వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ పరిధిలోని తిలారు - ఆమదాలవలస మధ్యలో రైల్వే కమ్ములు తదితర వస్తువులను చోరీ చేసి అమ్మకాలు చేపట్టిన వ్యక్తిపై శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆర్‌పిఎఫ్ ఒసి మనోజ్ కుమార్ బుధవారం కేసు నమోదు చేసినట్లు గురువారం తెలిపారు. ఆర్‌పిఎఫ్ పోలీసుల వివరాల మేరకు సారవకోట మండలం కిమిడి గ్రామానికి చెందిన మేదర మహేంద్ర దాస్ అనే వ్యక్తి కోటబొమ్మాళి మండలం కిష్టప్పపేట గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని ఆయన తిలారు సమీపంలో రైల్వే కమ్ములను చోరీ చేసి సారవకోటలో విక్రయాలు చేస్తుండగా ఆర్‌పిఎఫ్ పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేయకుండా కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు చెబుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నింధితుడి తరపున రాష్ట్ర, కేంద్ర మంత్రులు రైల్వే పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నుంచి తప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

## చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మాట్లాడుతున్న సిఐ

ఇళ్లల్లో దొంగతనాలు జరుగు తున్నాయని, ప్రజలు ఊళ్లకు వెళ్లినప్పుడు, బయటకు వెళ్లినప్పుడు మీ యొక్క బంగారం, నగదు, విలువైన వస్తువులను భద్రపర్చు కోవాలని సిఐ మీసాల చిన్నం నాయడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చోరీలు జరుగుతుండ డంతో ఈ ప్రాంతం ప్రజలను అప్రమత్తం చేస్తున్నా మన్నారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలు బంగారు ఆభరణాలు వేసుకొని జనాలు లేని ప్రదేశాల్లోకి వెళ్లరాదని, అదే విధంగా ద్విచక్ర వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేయరాదని, సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసుకొని హాండిల్ లాక్ వేసుకోవాలని సూచించారు. బంగారు నగలు మెరుగు పెడతానని వచ్చిన వ్యక్తులను నమ్మవద్దు అని అటువంటి వ్యక్తులు ఎవరైనా తారస పడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అలాగే అన్ లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అపరిచితులకు బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత వివరాలు చెప్ప కూడదన్నారు. అనుమానాస్పద స్థితిలో వ్యక్తులు సంచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో 16వ వార్డు పరిధిలో ఫకీరుపేట మండపం నుంచి త్రినాథ్ రెడ్డి ఆస్పత్రి వరకు జరుగుతున్న సిసి రోడ్డు పనులను గురువారం మున్సిపల్ కమీషనర్ రమేష్ పరిశీలించారు. ఎంతో కాలంగా నిలిచిన ఈ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడ నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా పనులు చేపట్టాలన్నారు. ఇన్‌ఛార్జి కామేశ్వరరావు, అమినీటిస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## తహశీల్దార్ల బదిలీ

**కొత్తూరు:** స్థానిక తహశీల్దార్‌గా పనిచేసిన బడే పాపారావు మెళియాపుట్టి తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎన్.సత్య నారాయణకు తహశీల్దార్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

**బూర్జ:** మండల తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన జె.ఈశ్వరమ్మ ఎల్ఎన్‌పేట మండలానికి బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేసిన వై.వి.పద్మావతి బూర్జ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

## కండ్రవీధి కాలువ పరిశీలన

**టెక్కలి:** మేజర్ పంచాయతీ పరిధి కండ్రవీధిలో ఉన్న మురికి కాలువ నీరు రోడ్డుమీద, ఇళ్లలోకి వెళ్లిన ప్రాంతాన్ని కార్యదర్శి కె.వి.వి.జగన్నాథం గురువారం పరిశీలించారు. చిన్నపాటి వర్షాలకే మురుగు కాలువ నీరు రోడ్డు మీదకు చేరడంతో బుధవారం ఉదయం కురిసిన కుండపోత వర్షానికి మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడం, ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదనరావులు పర్యటించడంతో అక్కడి ప్రజల జీవన పరిస్థితి చూశారు. వెంటనే మురికి కాలువ నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని వారు పంచాయతీ ఆదికారులను కోరారు. దీంతో గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించిన కార్యదర్శి రోడ్డుపై మురగునీరు పరిశీలించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆ ప్రాంత బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు.

## నైపుణ్యాలను అలవర్చుకోవాలి

**టెక్కలి:** డిగ్రీ చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు ఇతర విషయాలపై మెళకువలు, నైపుణ్యాలను అలవర్చుకోవాలని బి.సి.డి.ఇ సమన్వయకర్త అజయ్‌కుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే దశలోనే కమ్యూనిటీ సర్వీస్‌లపై కూడా అవగాహన అవసరమన్నారు. శిక్షణలో భాగంగా ప్రేరణ యాప్‌పై ఆప్పారావు అవగాహన కల్పించారు. తమ సంస్థ ద్వారా విద్యార్థులకు ఇంటర్నషిప్ వంటివి కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, డాక్టర్ లీలాపద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరానికి స్పందన

**పొందూరు:** మండలం గోరంటలో ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు మెడికవర్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 180 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే వీరిలో హెచ్ఐవి పరీక్షలు 86 మందికి చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగ భూషణరావు మాట్లాడుతూ సుఖవ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతిఒక్కరు తన యొక్క హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కోటి, సూర్య, ఫార్మసిస్ట్ నీలవేణి, మాధవరావు, జగది, జోనల్ సూపర్ వైజర్ సిహెచ్.ప్రసాద్, గణేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

గోరంటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం